క్లుప్తంగా

ఇద్దరి మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధి మిర్చి కాంపౌండ్‌లో హబీబ్ నగర్‌కు చెందిన మహమ్మద్ అజ్జుతో పాటు మరో వ్యక్తికి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివా రం తెలిపారు. ఇద్దరి మధ్య తోపులాటలో మహమ్మద్‌కు అక్కడ ఉన్న ఓ నెయిల్ కట్టర్‌కు చెందిన కత్తి గుచ్చుకున్నట్లు తెలిపారు. గాయాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని చెప్పారు.

పోలీస్ స్టేషన్‌లో పచ్చదనం పరిశుభ్రత



చెత్తను తొలగిస్తున్న ఎస్సై, కాంగ్రెస్ నేతలు

సిరికొండ: సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎస్సై రామ్‌తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ ఆవరణను శుభ్రం చేశారు.యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు మొట్టల రాము, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఆసిఫ్, గ్యామ శోభన్, యువకులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ బ్రాహ్మణ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖిల్లా రఘునాథ ఆలయం ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నడక, వ్యాయామం తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం నడవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ప్రముఖ యోగా మాస్టర్ మన్మోహన్ శాస్త్రి అన్నారు. ఖిల్లా రఘునాథ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ శర్మ, దత్తు శాస్త్రి, న్యాలం శ్రీనివాస్, చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: చిన్నవాల్గోట్ సమీపంలో శివాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి.. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని వారు తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడు రొండ్ల గోవర్ధన్‌రెడ్డి, బడాల మహిపాల్, రొండ్ల సాయారెడ్డి, దడివె చిన్న గంగారం, హరిదాసు, బుచ్చన్న, దీప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ



నిజామాబాద్ రూరల్: పండుగలు భారతీయ సంస్కృతి ప్రతిబింబాలని ప్రముఖ న్యాయవాది గిరిధర్ రావు దేశ్‌ముఖ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డు గీతా భవనంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం(ఇందూరు) ఆధ్వర్యంలో చంద్రశేఖర శర్మ రచించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. పంచాంగ కర్తను శాలువాతో సత్కరించి అభినందించారు. సంఘం ప్రతినిధులు రొట్టె సురేష్ పుల్కల్ రమేష్ కులకర్ణి, అప్పాల కిష్టయ్య, పురుషోత్తం రావు కులకర్ణి, గోవింద్ రావు దేశ్‌ముఖ్, చంద్రశేఖర శర్మ, మధుసూదన్ శర్మ పాల్గొన్నారు.

హనుమాన్ పడిపూజ



నిజామాబాద్ రూరల్: వాసవి వైశ్య సంఘం ధర్మపురి శాఖ ఆధ్వర్యంలో నగరంలోని దత్తాత్రేయ మందిరంలో హనుమాన్ పడిపూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హనుమాన్ మాలధారులు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. నుడా చైర్మన్ కేశవేణు, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, అల్లాడి రాజు, వీరేందర్, సంతోష్, రాజు న్నారు.

చురుకుగా రోడ్డు వెడల్పు పనులు

- తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- రూ.7 కోట్లతో అభివృద్ధి



నగరంలోని బస్వాగార్డెన్‌కు వెళ్లే మార్గంలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో రోడ్లు చాలా ప్రాంతాల్లో చిన్న చిన్నగా ఉన్నాయి. దీంతో నగర ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెడల్పునకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఇటీవల ఎక్కువగా మంజూరు చేస్తోంది. నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి బస్వాగార్డెన్ మీదుగా నుంచి దేవి రోడ్డు చౌరస్తా వరకు రోడ్డును వెడల్పు చేస్తున్నారు. దీని కోసం రూ.7 కోట్ల 50 లక్షలతో ఇప్పటికే పనులు ప్రారంభించారు. ఈ పనులకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేసి వెంటనే పనులు ప్రారంభించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసిన అధికారులు ఫిబ్రవరి నెలలో పనులు ప్రారంభించారు. ఇప్పటికే రోడ్డు ఒక సైడ్ డ్రైనేజీ నిర్మాణం 100 మీటర్ల మేర పూర్తి చేశారు. రోడ్డు వెడల్పు కావడంతో ఆక్రమణలు తొలగించేశారు.

నాలుగు లేన్ల రోడ్డు..

సుమారు 1.5 కిలో మీటర్ల రోడ్డును 80 ఫీట్ల మేర వెడల్పుతో నాలుగు లేన్లుగా చేయనున్నారు. భవనాలు నిర్మించుకున్న ప్రాంతంలో వదిలేసి మిగతా ప్రాంతాల్లో పనులు చేస్తున్నారు. ఈ రోడ్డు అత్యంత రద్దీగా మారుతున్న సమయంలో వెడల్పు చేయడంతో స్థానికులు హర్షం చేస్తున్నారు. అగ్రిమెంట్ ప్రకారం 18 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్నా.. మరో మూడు నెలల్లోనే పనులు పూర్తి చేసేలా ఉన్నారు. వేసవి కాలం కావడంతో చకచకా పనులు సాగుతున్నాయి.

నగర ప్రజలకు ఉపయోగకరం

రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. పెరుగుతున్న జనాభా దృష్ట్యా రోడ్లు చిన్నగా ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రోడ్డు వెడల్పు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఉండదు. ఆర్యనగర్, వినాయక్‌నగర్, తదితర ప్రాంతాల్లోని ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. – కృష్ణ, స్థానికుడు

త్వరగా పనులు పూర్తి చేయిస్తాం

మంత్రి శంకుస్థాపన చేయడంతో పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చాం. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. 1.5 కిలో మీటర్ల మేర 80 ఫీట్ల వెడల్పు చేస్తున్నారు. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటాం. – ప్రవీణ్ కుమార్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ

ప్రమాదకరంగా గండి అటవీ రోడ్డు

- గతేడాది డిసెంబర్ 20న మోస్రా మండల కేంద్రానికి చెందిన కొత్మికర్ లక్ష్మణ్(23) వ్యక్తిగత పనుల మీద జిల్లా కేంద్రానికి వస్తుండగా గండిలో మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఆయన చికిత్స పొందుతూ తర్వాత మృతి చెందాడు.
- ఇటీవల ఒక ద్విచక్ర వాహనదారుడు గండిలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



గండిలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



కల్వర్టు వద్ద ఇరుకుగా మారిన రోడ్డు

- మూడు ప్రదేశాలలో మూలమలుపులు
- 13 కల్వర్టుల వద్ద ఇరుకుగా మారిన రోడ్డు
- మల్లారం గండి ప్రాంతంలో తరచూ ప్రమాదాలు
- అధికారుల సమన్వయ లోపంతో వాహనదారులకు ఇబ్బందులు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలం వైపు నుంచి వర్ని మండలానికి వెళ్లాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. మల్లారం గండి అటవీ ప్రాంతంలో వాహదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూలమలుపులు ఎక్కువగా ఉండటంతో పాటు రోడ్లపై కల్వర్టుల వద్ద ఇరుకుగా మారడంతో ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. మండలంలోని గాంధీగనర్, మల్కాపూర్, ముత్తకుంట అటవీ ప్రాంతంలో సుమారు 7 కిలోమీటర్ల మేర మాత్రమే రెండు వరుసల్లో దారి ఉంది. మిగిలినది అంతా నాలుగు వరుసలున్నా గండి ప్రాంతంలో మాత్రం విస్తరణకు నోచుకోలేదు. మల్లారం గండి ప్రాంతంలో 13 కల్వర్టులున్నాయి. మూడు చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం ఈ రహదారిలో వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ మార్గంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఇటీవల రూరల్, ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లతో పాటు, మూల మలుపుల వద్ద రాత్రి వేళల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా రేడియం స్టిక్కర్లతో ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. స్థానికులు రోడ్డు విస్తరణ కోసం అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. అటవీ, ఆర్‌ఎండ్‌బీ శాఖాధికారుల సమన్వయలోపంతో ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

రాత్రివేళ భయంగా ఉంటుంది

నేను బట్టల అమ్ముకోవడానికి వర్ని, మోస్రా మండలాలకు వెళ్తుంటాను. రాత్రి సమయంలో రావడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. అసలు ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక భయపడుతున్నాను. అధికారులు పట్టించుకొని రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి. –నర్సయ్య, నగరవాసి

నిధులు మంజూరయ్యాయి

మల్లారం గండి ప్రాంతంలో ఉన్న కల్వర్టులకు నిధులు మంజూరయ్యాయి. కాని అటవీ అధికారులు స్థలం ఇస్తే శిథిలావస్థలో ఉన్న కల్వర్టులు వెడల్పు చేస్తాం. కాని దీంతో పాటు రోడ్డు విస్తరణ కూడా అటవీ శాఖాధికారులు స్థలాన్ని కేటాయించాలి. దీని కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపాం. – గులాబ్ సింగ్, ఆర్‌ఎండ్‌బీ డీఈ

అమరవీరులను ఆదర్శంగా తీసుకోవాలి



నగరంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..



తెయూలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నేతలు



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..



గడ్కోల్‌లో.. మాస్‌లైన్ నాయకులు



జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో..




ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

సాక్షి నెట్‌వర్క్: స్వాతంత్య్రం కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నా రు. అలాంటి వీరులే స్ఫూర్తిగా తీసుకొని ఈ దేశం కోసం జాతీయ భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వ ర్యంలో ఆదివారం అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో స్వాతంత్య్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- యాసంగిలో ఎత్తిపోతున్న బోరు బావులు
- చెక్‌డ్యాములు లేకపోవడం, ఇసుక తవ్వకాలే ప్రధాన కారణం
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు



గౌరారం వద్ద శిథిలావస్థకు చేరిన చెక్‌డ్యామ్

ఇందల్వాయి: మండలంలో వాగుల వెంబడి నూతన చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు చేపట్టక, ప్రారంభించిన వాటి పనులు నత్తనడకన సాగుతుండటం, ఉన్నవాటికి మరమ్మతులు చేయక పోవడంతో భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. దీనికి తోడు అక్రమార్కులు అధికారులతో కుమ్మక్కై అరకొర అనుమతులతో ఇష్టారీతిన ఇసుకను తోడేస్తుండటంతో పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. భూగర్భ జలాలు తగ్గి ప్రతీ ఏడాది యాసంగి వరి పంటలకు చివరి దశలో నీరందక ఎండిపోతున్నాయి.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు..

అధికారుల నిర్లక్ష్యమో, అక్రమార్కుల భరితెగింపో గానీ ఇసుక తవ్వకాలు మాత్రం యథేచ్ఛగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్ల ముసుగులో కొందరు, అధికారుల అండదండలతో మరికొందరు ఇసుకను దర్జాగా వాగుల నుంచి తరలిస్తున్నారు. లింగాపూర్ వంతెన నిర్మాణ కోసం, నల్లవెల్లి–మేఘ్యనాయక్ తండా రోడ్డు నిర్మాణ పనుల కోసం కాంట్రాక్టర్లు అనుమతులు లేకుండా జేసీబీల సహాయంతో గుట్టల కొద్దీ ఇసుకను డంప్ చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తుండటం గమనర్హం. అధికార యంత్రాంగం స్పందించి చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



లింగాపూర్ వద్ద వాగులోంచి ఇసుకను తరలిస్తూ..

మండలంలో పరిస్థితి ఇలా..

మండలంలోని సిర్నాపల్లి నుంచి నల్లవెల్లి, గౌరారం, ఎల్లారెడ్డిపల్లె, లోలం గ్రామాల మీదుగా మల్లాపూర్ వరకు సుమారు 15 కిలో మీటర్ల మేర వాగు పరివాహక ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో 12 ఏళ్లలో నూతన చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు జరగకపోగా, గతంలో ఉన్నవి కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు. నల్లవెల్లిలో ఉన్న వాగులో చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3.25 కోట్ల నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కావడం లేదు. గౌరారం వద్ద రూ.2.55 కోట్ల నిధులతో వారం క్రితం చెక్‌డ్యామ్ నిర్మాణం ప్రారంభమైనా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

సమస్యలను పరిష్కరించాలి

వాగు పరివాహక రైతుల పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకొని వారి సమస్యలు పరిష్కరించాలి. ఇష్టారీతిన సాగుతున్న ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి. చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి. మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి. – సంబారు దత్తు, గౌరారం

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ఎలాంటి అనుమతులు లేకుండా వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేసి చర్యలు తీసుకుంటాం. డీడీలు చెల్లించి నిర్మాణ సంబంధిత ధ్రువపత్రాలు ఉంటే అనుమతులు మంజూరు చేస్తున్నాం. అక్రమ ఇసుక రవాణాపై ప్రజలు.. అధికారులకు సమాచారం అందించాలి. – వెంకట్‌రావు, తహసీల్దార్, ఇందల్వాయి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భాను రామగిరి



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆర్మూర్ లైఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ధన్వంతరి విజయయాత్ర–2లో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో ఎండీ ఫిజిషియన్ డాక్టర్ భాను రామగిరి, ఎండీ న్యూరో డాక్టర్ శ్రీకాంత్ లోయ, ఎండీ డీజీవో డాక్టర్ స్రవంతి రెడ్డిలు వైద్య సేవలు అందించారు. 210 మంది రోగులను పరీక్షించి రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం సిఫారసు చేశారు. ఉప్లూర్‌తో పాటు నాగాపూర్, దమ్మన్నపేట, శ్రీరాజరాజేశ్వరీ నగర్, డబ్బ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి శిబిరంలో వైద్య సేవలను వినియోగించుకున్నారు. సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, వీడీసీ అధ్యక్షుడు సోమ దశరత్, నాయకులు ఎనెడ్ల మురళి, చిన్నారెడ్డి, లక్ష్మణ్, నందగిరి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,600	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	83,620		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	50	75	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	10	20
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	50	75
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 కోర్ట్ 1.40, 7.30, 10.30
ఆర్టిస్ట్(తెలుగు)-4.35
స్క్రీన్-2 ఎవడే సుబ్రహ్మణ్యం 10.50, 4.30
పెళ్లికాని ప్రసాద్ 1.40, 7.30
స్క్రీన్-3 ఎవడే సుబ్రమణ్యం(తెలుగు)-1.30
ఆర్టిస్ట్(తెలుగు)-7.30-సలార్-పార్ట్-1(తెలుగు)-10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 ఛావా 10.00, 4.45, 10.45
అనగనగా ఆస్ట్రేలియాలో-1.20 షణ్ముక-8.05
స్క్రీన్-2 కోర్ట్-10.05, 4.30, 7.35, 10.40
ఛావా(హిందీ)-1.10
స్క్రీన్-3 కిస్ కిస్ కిస్సిక్-11.00, 7.30
షణ్ముక-1.50 – ఆర్టిస్ట్-4.30, 10.20
స్క్రీన్-4 సలార్-పార్ట్-1-10.20, 4.25, 10.30 పెళ్లికాని ప్రసాద్-1.50, 7.55
లలితామహల్ కోర్ట్, దేవి పెళ్లికానిప్రసాద్
నటరాజ్ షణ్ముక, విజయ్ సలార్

ఎక్స్‌పోలతో విద్యార్థుల ప్రతిభ బయటపడుతుంది



నిజామాబాద్‌అర్బన్: ఎక్స్‌పోలతో విద్యార్థుల ప్రతిభ బయటపడుతుందని నిజామాబాద్ సౌత్ ఎంఈవో సాయిరెడ్డి అన్నారు. ఆదివారం విశ్వ వికాస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రశంసించారు. విశ్వ వికాస్ పాఠశాల ప్రిన్సిపల్ సుస్మిత మాట్లాడుతూ..వి ఇగ్నైట్ ఎక్స్‌పో విజయవంతంగా జరిగిందన్నారు. ఇంతటి పెద్ద కార్యక్రమం నిర్వహించడానికి సి–ల్యాబ్స్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విశ్వవికాస్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన మహారాష్ట్ర రైతులు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన 30 మంది రైతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అంకాపూర్‌లో సాగవుతున్న మొక్కజొన్న, పసుపు, ఆయిల్ పామ్ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే విత్తన శుద్ధి కర్మాగారాలు, నీటి నిలువ తొట్టెలను పరిశీలించారు. అంకాపూర్ వీడీసీ అధ్యక్షుడు అనంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆలూర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్



విద్యార్థులతో జిల్లా జడ్జి సునీత కుంచాల

నిజామాబాద్ నాగారం: మాధవనగర్‌లోని బీఎల్‌ఎన్ గార్డెన్‌లో నిజామాబాద్ డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ మనోజ్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా డిస్టిక్ జడ్జి సునీత కుంచాల హాజరై విద్యార్థులను అభినందించారు. దీనికి స్పాన్సర్‌గా డాక్టర్ శ్రీనివాస్ వ్యవహరించారు. తైక్వాండో జిల్లా చైర్మన్ బస్వా లక్ష్మీనరసయ్య, వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర గుప్తా, బ్లాక్ బెల్ట్ నేహ గంగాధర్, నాగరాజ్ సిద్ధార్థ, రిత్విక, గోపికృష్ణ, క్రీడాకారులు, తల్లిదండ్రులున్నారు.